

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 43 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 13, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# సమస్యల వలయంలో..
# సంక్షేమ హాస్టల్స్ !



**ఎస్సీ వసతి గృహాల్లో కరువైన మౌలిక వసతులు**

**వార్డెన్ల నిర్లక్ష్యంతో అల్లాడుతున్న విద్యార్థులు**

**జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ**

**హైద్రాబాద్, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ ఎస్సీ వసతి గృహాల్లో మౌలిక వసతుల కొరత, అపరిశుభ్రత, నాసిరకమైన భోజనం, కలుషిత నీరు వంటి సమస్యలతో విద్యార్థుల జీవనం ఆందోళనకరంగా మారిందని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ లో ఉన్న సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లపై ఆశలు పెట్టుకుని చేరితే, అక్కడ ఎదురవుతున్న సమస్యలు వారి చదువు, ఆరోగ్యం రెండింటినీ ప్రమాదంలోకి నెడుతున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై పూర్తి బాధ్యత వహించాల్సిన వార్డెన్ల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గదులు, ప్రాంగణాలు, బాత్‌రూములు సకాలంలో శుభ్రం చేయకపోవడంతో హాస్టళ్లలో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. ఎటు చూసినా దుర్గంధం వ్యాపిస్తూ, విద్యార్థులు కనీసం గదుల్లో కూర్చోలేని పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. “అయ్యో బాబోయ్‌ో ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ఉండాలి” అంటూ విద్యార్థులు గగ్గోలు పెడుతున్నా, ఆర్థిక పరిస్థితులు అనుమతించక ప్రైవేట్ హాస్టళ్లకు వెళ్లలేక ఇక్కడే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

**నిద్రను దూరం చేస్తున్న నల్లుల బెడద..**

పగలంతా చదువులతో అలసిపోయిన విద్యార్థులు రాత్రి విశ్రాంతి తీసుకుందామంటే గదుల్లో నల్లుల బెడద తీవ్రంగా ఉందని చెబుతున్నారు. పడకలు, దుప్పట్లు నల్లులతో నిండిపోయి నిద్రలేమితో పాటు చర్మవ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుభ్రత, పెస్ట్ కంట్రోల్ విషయంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా వార్డెన్లు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నాసిరకమైన భోజనం - లంచ్‌లో గొడ్డు కారం..**

సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వం గణనీయమైన నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా, ఆ నిధులు విద్యార్థుల వరకు సరిగా చేరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సప్లై నూకల బియ్యం సరఫరా పేరుతో నాణ్యతలేని బియ్యం వాడుతున్నారని, సరిగా ఉడకని అన్నం, రుచిలేని కూరలతో భోజనం అందిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. కొద్ది మందికి మాత్రమే సరిపడా అన్నం

- మిగతా 2లో..

## ట్రాఫిక్ చలాన్లపై డిస్కౌంట్లు వద్దు

**- సీఎం రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్, జనవరి 12, 2026(జై భీమ్ న్యూస్)**



రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను మరింత కఠినంగా అమలు చేయాలని రేవంత్ రెడ్డి పోలీసు శాఖను ఆదేశించారు. ట్రాఫిక్ చలాన్లపై ఇకపై ఎలాంటి డిస్కౌంట్లు ఇవ్వవద్దని స్పష్టం చేసిన సీఎం, నేరుగా బ్యాంకు ఖాతాల నుంచి జరిమానా మొత్తం కట్ అయ్యే విధంగా బ్యాంకింగ్ వ్యవస్థతో సమన్వయం (సింక్రనైజేషన్) చేయాలని సూచించారు. ట్రాఫిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని, డీజీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ట్రాఫిక్ అమలు వ్యవస్థ కొనసాగుతుందని సీఎం తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రత విషయంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన సూచించారు.

## సంక్రాంతి రద్దీ

చర్లపల్లి-అనకాపల్లి మధ్య మరో 3 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్‌లోని చర్లపల్లి - అనకాపల్లి మధ్య కొత్త సర్వీసులు

ఇప్పటికే 170కి పైగా ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ

సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

సికింద్రాబాద్‌లో తాత్కాలికంగా పార్కింగ్ నిలిపివేత


6

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి


రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు




7




## సంక్రాంతి వేళ రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

**సన్న ధాన్యం రైతులకు రూ.500 కోట్ల బోనస్ విడుదల**

**హైద్రాబాద్, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు బోనస్ విడుదల చేస్తూ తెలంగాణ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సన్న వడ్లకు సంబంధించి రూ.500 కోట్ల బోనస్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు సన్న ధాన్యం బోనస్‌గా మొత్తం రూ.1,429 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. విడుదలైన ఈ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో పండుగ వేళ రైతులకు తక్షణ ఆర్థిక ఊరట కలగనుందని పేర్కొన్నారు. సన్న ధాన్యం సాగును మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో, కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. సన్న వడ్ల సాగు పెరగడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతో పాటు, రాష్ట్రంలో నాణ్యమైన బియ్యం ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బోనస్ విడుదలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండుగ వేళ ఖాతాల్లోకి డబ్బులు జమ కావడంతో తమ సంతోషం రెట్టింపు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతు సంక్షేమానికి మరో ఉదాహరణగా నిలిచిందని వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశం

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

యువత తమ క్రీడా ప్రతిభను వెలికితీయడానికి సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సోమవారం ఖిలా వరంగల్‌లోని ఖుష్ మహల్ వద్ద సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నూతనంగా నిర్మిస్తున్న ఐడీఓసీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువత లక్ష్య సాధనలో స్వామి వివేకానందుని మార్గాన్ని అనుసరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "రూరల్ టు గ్లోబల్ ఛాంపియను నినాదంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులలోని ప్రతిభను వెలికి తీయడమే సీఎం కప్ రెండవ ఎడిషన్ ముఖ్య లక్ష్యమన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లోని యువత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్రీడాపోటీలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో సీఎం కప్ టార్చ్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాట్స్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో ఈ నెల 17 నుంచి 22 వరకు, మండల స్థాయిలో 28 నుంచి 31 వరకు, నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు పోటీలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా దామోదర్ యాదవ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, జిల్లా యువజన క్రీడాధికారి అనిల్, డీపీఆర్ఓ ఆయూబ్ అలీ, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్, 4వ బెటాలియన్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# మడిపెల్లి గ్రామంలో ఇంద్రమ్మ చీరల పంపిణీ

మహిళా సంక్షేమమే లక్ష్యంగా గ్రామ పాలకవర్గం కార్యక్రమం



**హసన్‌పర్తి, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల పరిధిలోని మడిపెల్లి గ్రామంలో మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంద్రమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బుర్ర రంజిత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా గ్రామపంచాయతీ కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇంద్రమ్మ చీరల వంటి పథకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామ మహిళలకు అవసరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాందారి ప్రదీప్, వార్డు సభ్యులు రణధీర్, బుర్ర రాజు, ఐలయ్య పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు గ్రామ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని కోరారు. గ్రామంలో సామాజిక ఐక్యతను పెంపొందించేలా, మహిళలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని గ్రామ పాలకవర్గం తెలిపింది. ఈ కార్యక్రమం గ్రామంలో మంచి స్పందన పొందింది.

# మాజీ సీఎం కొణిజేటి రోశయ్య సతీమణి కన్నుమూత

వృద్ధాప్య సమస్యలతో బాధపడిన రోశయ్య సతీమణి

అమీర్‌పేటలోని నివాసంలో ఈ రోజు కన్నుమూసిన శివలక్ష్మి

అమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రముఖులు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని అమీర్‌పేట నివాసంలో ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలియడంతో రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ప్రముఖులు ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలుపుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

# సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్స్

మొదటి పేజీ తరువాయి

పెట్టి, మిగిలిన వారికి గొడ్డు కారం పెట్టే పరిస్థితులు తరచూ జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాల్సిన చోట మెనూకే దిక్కులేని పరిస్థితి నెలకొంది. చాలా హాస్టళ్లలో మెనూ బోర్డులే కనిపించకపోవడం గమనార్హం.

**కలుషిత నీటితో అనారోగ్యాల పాలవుతున్న విద్యార్థులు..**

ప్రతి సంక్షేమ హాస్టల్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని సరిగా వినియోగించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని హాస్టళ్లలో వాటర్ ప్లాంట్లు ఉన్నా అవి నిర్వీర్యంగా మారాయని, ఫిల్టర్ నీరు అందక బోరు నీటినే తాగాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. కలుషిత నీటి కారణంగా జ్వరాలు, కడుపు నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అద్దె భవనాల్లో వసతి – భద్రతా లోపం..**

చాలా సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తుండటంతో స్థలాభావం, మౌలిక వసతుల లోపం, భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. సరైన వెంటిలేషన్ లేకపోవడం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేని పరిస్థితి ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, వార్డెన్లు గానీ, ఉన్నతాధికారులు గానీ తగిన చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పర్యవేక్షణ, నిర్వహణలోని నిర్లక్ష్యమే సంక్షేమ హాస్టళ్ల దుస్థితికి ప్రధాన కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే వారి చదువు మాత్రమే కాకుండా ఆరోగ్యం కూడా తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి హాస్టళ్లలో పరిశుభ్రత, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయాలు, వసతి భద్రతను మెరుగుపరచాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ వంటి కార్యక్రమాల అమలు కూడా కష్టసాధ్యమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తిమ్మాపూర్‌లో డ్రోన్ ద్వారా వరి పంట పిచికారి విధానంపై రైతులకు శిక్షణ

**ఎల్కతుర్తి, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

తిమ్మాపూర్ గ్రామంలో బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో వరి పొలాల్లో డ్రోన్ ద్వారా మందుల పిచికారి చేసే ఆధునిక విధానంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతుల్లో విశేష ఆసక్తిని కలిగించింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు డి. ఆది రెడ్డి హాజరయ్యారు. అలాగే వరంగల్ జిల్లా పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగుల వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి యం. రాజ్ కుమార్ పాల్గొని రైతులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు డ్రోన్ సాంకేతికత ద్వారా పంట పొలాల్లో మందుల పిచికారీ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సమర్థవంతంగా మందు చల్లవచ్చని, రైతుల శ్రమ తగ్గడంతో పాటు మందు వృథ కాకుండా సమానంగా పంటపై పడుతుందని వివరించారు. అలాగే ఆరోగ్యపరమైన ప్రమాదాలు తగ్గుతాయని, దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. డ్రోన్ ద్వారా పిచికారీ సేవకు ఎకరానికి రూ.325 మాత్రమే తీసుకుంటామని, అవసరాన్ని బట్టి రైతులు ఈ సేవను వినియోగించుకోవచ్చని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రోజా, అభ్యుదయ రైతులు ఆదిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. డ్రోన్ వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా రైతులు ఆధునిక సాగు వైపు అడుగులు వేయాలని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని పాల్గొన్న అధికారులు సూచించారు.

# ఔరా సైబర్ నేరగాళ్లు..!

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ భార్యకే కుచ్చుటోపీ!

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ భార్య ఊర్మిళ

స్టాక్ మార్కెట్ లాభాల ఆశచూపి రూ.2.58 కోట్లు స్వాహా

వాట్సాప్ గ్రూపులో చేర్చి, నకిలీ యాప్‌తో మోసగించిన కేటుగాళ్లు

మోసం కోసం భర్త బంగారాన్ని కూడా తాకట్టు పెట్టిన బాధితురాలు

ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఇటీవల ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్య సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారన్న వార్త వెలుగులోకి వచ్చింది. అయితే, ఆ మాజీ ఐపీఎస్ అధికారి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అని, బాధితురాలు ఆయన భార్య ఊర్మిళ అని తెలియడంతో ఈ ఘటన అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఆమె నుంచి సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ. 2.58 కోట్లు కాజేశారు. వివరాల్లోకి వెళితే.. ఊర్మిళ వాట్సప్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి ఓ మెసేజ్ వచ్చింది. తాము సూచించిన విధంగా స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. అనంతరం ఆమెను 'స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్చేంజ్ 20' అనే వాట్సాప్ గ్రూపులో చేర్చారు. ఈ గ్రూప్‌లో దినేష్ సింగ్ అనే వ్యక్తి, తాను చెప్పినట్లు చేస్తే 500 శాతం లాభాలు ఖాయమని, కొన్ని స్క్రీన్‌షాట్లు పంపి నమ్మించాడు. అతనికి సహకరిస్తూ, అదే ముఠాకు చెందిన ప్రియసఖి అనే మహిళ తనకు కూడా లాభాలు వచ్చాయంటూ గ్రూప్‌లో పోస్టులు పెట్టింది. వీరి మాయ మాటలు నమ్మిన ఊర్మిళ, యాపిల్ యాప్ స్టోర్ నుంచి 'వీజఖ×జ్ జవీ' అనే నకిలీ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అనంతరం డిసెంబర్ 24 నుంచి జనవరి 5 మధ్య కాలంలో పలు దఫాలుగా రూ. 2.58 కోట్లను నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశారు. ఇందుకోసం తన వద్ద ఉన్న బంగారంతో పాటు, భర్త లక్ష్మీనారాయణకు చెందిన బంగారాన్ని కూడా ఆమె తాకట్టు పెట్టడం గమనార్హం. యాప్‌లో లాభాలు కనిపిస్తున్నా, డబ్బును వెనక్కి తీసుకునే (విత్‌డ్రా) ఆప్షన్ లేకపోవడంతో తాను మోసపోయానని ఆమె గ్రహించారు. వెంటనే బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ఊర్మిళ పంపిన డబ్బును సైబర్ నేరగాళ్లు మ్యూల్ ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆ ఖాతాలను గుర్తించి, నిందితులను పట్టుకునే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు.

# మానసిక వికలాంగురాలిపై అత్యాచారం.. నిందితుడి అరెస్ట్, రిమాండ్

**ఎల్కతుర్తి, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

మానసిక వికలాంగురాలిపై అత్యాచారం జరిగిన దారుణ సంఘటన గ్రామీణ ప్రాంతాన్ని కలచివేసింది. పోలీసు అధికారుల వివరాల ప్రకారం, బాధితురాలు మానసిక వికలాంగురాలు కాగా సాధారణంగా ఇంటి వద్దనే ఉంటూ తల్లిదండ్రుల సంరక్షణలో జీవిస్తోంది. సంఘటన జరిగిన రోజు ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లారు. ఆ సమయంలో ఆమెకు దూరపు బంధువైన పోలె పాక ప్రభాకర్ (55) --- పెగడపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి --- ఇంటికి వచ్చి పరిస్థితిని దుర్వినియోగం చేసుకుని అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. అనంతరం ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని బాధితురాలిని బెదిరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి తిరిగివచ్చిన తర్వాత కుమార్తె పరిస్థితిలో మార్పును గమనించి ప్రశ్నించగా, జరిగిన విషయాన్ని ఆమె వివరించింది. వెంటనే తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆరోపణలు నిజమని ప్రాథమిక ఆధారాలు లభించాయని అధికారులు తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే బాధిత కుటుంబానికి చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇలాంటి హీనమైన నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, మహిళలు, వికలాంగులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. గ్రామస్థులు కూడా నిందితుడిపై కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. గమనిక: లైంగిక నేరాల కేసుల్లో బాధితుల గుర్తింపును గోప్యంగా ఉంచడం చట్టబద్ధమైన బాధ్యత. అవసరమైతే సమీప పోలీస్ స్టేషన్ లేదా మహిళా సహాయ సేవలను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ ఆచార్యురాలు సి. జే. శ్రీలతకు జాతీయ స్థాయి గౌరవం



**హన్మకొండ, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యురాలు ఆచార్య సి. జే. శ్రీలత 2025 సంవత్సరానికి గాను "ఇండియా'స్ మోస్ట్ ప్రాజిమెటిక్ ఉమెన్ లీడర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ -- 2025" అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును జనవరి 10న బెంగళూరులోని హ్యాట్ సెంట్రిక్ లో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ అండ్ సమ్మిట్ కార్యక్రమంలో ఆమెకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో పాటు పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య సి. జే. శ్రీలతను హృదయపూర్వకంగా అభినందించారు.

# ప్రాణాంతక కడుపు క్యాన్సర్‌పై గెలుపు

### మెడికవర్ హాస్పిటల్‌లో విజయవంతమైన క్లిష్ట శస్త్రచికిత్స



**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్ మరోసారి తన వైద్య నైపుణ్యాన్ని చాటుకుంది. ప్రాణాంతకమైన కడుపు క్యాన్సర్‌తో బాధపడుతున్న 55 ఏళ్ల వ్యక్తికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, అతడికి కొత్త జీవితం ప్రసాదించారు. కొన్ని వారాలుగా తీవ్రమైన కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్న రోగి మెడికవర్ హాస్పిటల్‌ను ఆశ్రయించగా, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. సునీల్ నాగుల ఆధ్వర్యంలో ఎండోస్కోపీ, సీటీ స్కాన్ వంటి ఆధునిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రారంభ దశలోనే స్టమక్ క్యాన్సర్ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం వల్ల శస్త్రచికిత్స ద్వారానే పూర్తిస్థాయి చికిత్స సాధ్యమని వైద్య బృందం స్పష్టం చేసింది. ఆంకాలజీ నిపుణుల సూచనల మేరకు డా. సునీల్ నాగుల నేతృత్వంలో టోటల్ గ్యాస్ట్రెక్టమీ విత్ డి2 లింఫ్ నోడ్ డిసెక్షన్ అనే అత్యంత సాంకేతికంగా క్లిష్టమైన శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. గంటల తరబడి సాగిన ఈ ఆపరేషన్ పూర్తిగా విజయవంతమై, ఆపరేషన్ అనంతరం రోగి ఆశించినదానికంటే వేగంగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. వరంగల్ ట్రైసిటీ పరిధిలో ఇలాంటి అధునాతన గ్యాస్ట్రో--ఇంటెస్టైనల్ క్యాన్సర్ శస్త్రచికిత్సలు కొద్ది కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండగా, మెడికవర్ హాస్పిటల్‌లో స్టమక్, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్లకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో చికిత్సలు అందుతున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు కూడా నాణ్యమైన క్యాన్సర్ వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. సునీల్ నాగుల మాట్లాడుతూ, "కడుపులో తరచూ నొప్పి, ఆకలి లేకపోవడం, తెలియని బరువు తగ్గడం, రక్తహీనత, తిన్న వెంటనే నిండిపోయిన భావన వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు" అని ప్రజలకు సూచించారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్స కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

### మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్



**హన్మకొండ, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సామాజిక బాధ్యతను నాటిన మహోనీయుడు స్వామి వివేకానంద అని మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలోని భారత్ రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ అధ్యక్షత వహించగా, దాస్యం విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడిన దాస్యం విజయ్ భాస్కర్, భారతదేశ హైందవ ధర్మ గౌరవాన్ని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప తత్వవేత్త స్వామి వివేకానంద అని కొనియాడారు. వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలను తన ఆచరణల ద్వారా బోధించిన మహానుభావుడిగా ఆయనను ప్రశంసించారు. యువత స్వామీజీ ఆదర్శాలను ఆచరించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు దూలం వెంకన్న, జానకీ రాములు, సల్వాజీ రవీందర్ రావు, కోటేశ్వర్ రావు, ఖలీల్, మూటిక రాజు యాదవ్, బోడ దశరథం, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి లోహితా రాజు, సౌరం రఘు, ఆదిత్య యాదవ్, రాజ్ కుమార్, అనిల్, ఉదయ్, అభి తదితరులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి 66వ డివిజన్ అభివృద్ధి పనులను తక్షణమే వేగవంతం చేయాలి

### జిడబ్ల్యూఎంసి అడిషనల్ కమిషనర్‌కు హసన్‌పర్తి అభివృద్ధి కమిటీ వినతిపత్రం



**హసన్‌పర్తి, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి 66వ డివిజన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ హసన్‌పర్తి అభివృద్ధి కమిటీ నాయకులు సోమవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జిడబ్ల్యూఎంసి) అడిషనల్ కమిషనర్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ కన్వీనర్ పెద్దమ్మ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్ నాయకత్వం వహించారు. వినతిపత్రంలో ముఖ్యంగా హసన్‌పర్తి ప్రజలకు అత్యవసరమైన ఉమ్మడి స్మశాన వాటిక అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికలో ప్రహరీ గోడ, అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు, షెడ్ వంటి మౌలిక సదుపాయాల కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అదేవిధంగా హసన్‌పర్తి గాంధీనగర్ రోడ్డుతో పాటు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తైన పలు సీసీ రోడ్ల అభివృద్ధి పనులు నెలల తరబడి ప్రారంభం కాకపోవడం వల్ల వర్షాకాలంలో మట్టిమయమవడం, ఎండాకాలంలో ధూళి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, పాఠశాల పిల్లలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిడబ్ల్యూఎంసి అడిషనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే 66వ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను తన ఛాంబర్‌కు పిలిపించి సంబంధిత అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని, పనులు ఆలస్యం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ పెద్దమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ --- "ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే అభివృద్ధి పనులు ప్రారంభించాలి. లేనిపక్షంలో జనవరి 23న హసన్‌పర్తి ప్రజలు చేపట్టే నిరసన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ పూర్తిస్థాయిలో పాల్గొంటుంది" అని హెచ్చరించారు. అభివృద్ధి కోసం ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు మేకల హరిశంకర్, అనుమాండ్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొని హసన్‌పర్తి అభివృద్ధిపై తమ సంఘీభావాన్ని తెలియజేశారు. హసన్‌పర్తి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతమైతేనే ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుతాయని, అధికారులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

## సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తాం

### మాజీ మంత్రి తలసాని వివాదాస్పద హెచ్చరిక



**హైద్రాబాద్, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా సహించేది లేదని మాజీ మంత్రి, తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్ ప్రాంతాన్ని విడదీసి ఇతర కార్పొరేషన్లలో కలపాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి "సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తాం" అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. పరిపాలనా సౌలభ్యాల నెపంతో తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని పునర్వ్యవస్థీకరించి కొత్త మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటు యోచనలో ఉందని సమాచారం. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లోని కొన్ని ప్రాంతాలను ప్రతిపాదిత మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లో విలీనం చేయవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసే అంశం కూడా చర్చల్లో ఉంది. ఈ మార్పుల వల్ల సికింద్రాబాద్ తన చారిత్రక ప్రాధాన్యతను, భౌగోళిక గుర్తింపును కోల్పోయే ప్రమాదం ఉందని తలసాని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కలిపి ఒకే జిల్లాగా లేదా ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే స్థానిక వ్యాపార, కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించిన తలసాని, "లష్కర్ అస్తిత్వంపై దెబ్బకొడితే ఊరుకోం" అంటూ హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర ప్రతిస్పందనలకు దారి తీస్తుండగా, భారత రాష్ట్ర సమితి వర్గాలు వాటిని తమ నిరసన స్వరంగా సమర్థిస్తున్నాయి.

## మెడికోవర్ హాస్పిటల్‌లో 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా మెడికవర్ హాస్పిటల్ అధునాతన ఆర్థోపెడిక్ చికిత్సలో ఒక ప్రధాన మైలురాయిని సాధించింది. ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ మరియు రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ బృందం అత్యంత ఖచ్చితత్వం, తక్కువ నొప్పి, వేగవంతమైన వైద్యం మరియు మెరుగైన నడిచే శక్తి అందిస్తోంది. మెడికోవర్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ ఒ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. డి. చక్రవర్తి, ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్, స్పోర్ట్స్ మెడిసిన్ మరియు ఆర్థ్రోస్కోపీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సంజయ్ ప్రసాద్ హెగ్డే, జాయింట్ మరియు స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి, హాస్పిటల్ హెడ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. డాక్టర్ ఆర్. డి. చక్రవర్తి మాట్లాడుతూ, "మా ఆసుపత్రి 100 విజయవంతమైన రోబోటిక్ చీలమండ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేయడం గర్వకారణం. రోబోటిక్ టెక్నాలజీ శస్త్రచికిత్సలో ఎక్కువ ఖచ్చితత్వాన్ని అనుమతించింది, ఫలితంగా రోగులకు మెరుగైన ఫలితాలు వచ్చాయి" అని ఆయన అన్నారు. "రోబోటిక్ చీలమండ మార్పిడి శస్త్రచికిత్స ప్రతి రోగికి వ్యక్తిగతీకరించిన చికిత్సను అందించడంలో సహాయపడుతుంది. ఇది నొప్పిని తగ్గిస్తుంది మరియు రోగులు త్వరగా నడిచే శక్తి తిరిగి పొందడంలో సహాయపడుతుంది" అని డాక్టర్ సంజయ్ ప్రసాద్ హెగ్డే అన్నారు. ఆసుపత్రి అధిపతి కృష్ణమూర్తి మాట్లాడుతూ, "ఈ విజయం మెడికోవర్ హాస్పిటల్ యొక్క అధునాతన వైద్య సాంకేతికత మరియు నాణ్యమైన సంరక్షణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. రోగులకు ప్రపంచ స్థాయి ఆర్థోపెడిక్ చికిత్సను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని ఆయన అన్నారు. మెడికోవర్ హాస్పిటల్ యొక్క ఆర్థోపెడిక్ విభాగం కీళ్ల మార్పిడి, ఆర్థ్రోస్కోపీ మరియు స్పోర్ట్స్ మెడిసిన్‌లో ఉన్నత స్థాయి సంరక్షణను అందిస్తూనే ఉంది.

## సంక్రాంతికి ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ రాజశేఖర్

**మందమర్రి, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలు పెద్ద సంఖ్యలో తమ స్వగ్రామాలకు ప్రయాణించే నేపథ్యంలో దొంగతనాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాజశేఖర్ సూచించారు. పండుగ సమయంలో ఇళ్లలో ఎవరు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య ప్రాంతాల్లో ప్రత్యేక బీట్ పట్రోలింగ్ చేపట్టామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు విలువైన నగలు, పత్రాలు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పొరుగువారికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వెళ్లడం ద్వారా భద్రత మరింత బలపడుతుందని తెలిపారు. విద్యుత్ లైట్లు, టైమర్లు వంటి భద్రతా ఏర్పాట్లు వినియోగిస్తే చోరీల ముప్పు తగ్గుతుందన్నారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ సూచనలు పాటిస్తే సంక్రాంతి పండుగను నిర్బంధం లేకుండా సంతోషంగా గడపవచ్చని పేర్కొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ టీవీ యాంకర్ సుమ కనకాల



**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవాలయంలో ప్రముఖ టీవీ యాంకర్ సుమ కనకాల అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పూజానంతరం ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రములను బహూకరించి, మహాదాశీర్వచనంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, మయూరి రామేశ్వర్ రావు, ఓరుగంటి పూర్ణచందర్, సూపరింటెండెంట్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. సుమ దర్శనానికి వచ్చిన భక్తులు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహంగా ముందుకొచ్చారు. భక్తుల ప్రేమాభిమానాలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

## చెక్ బౌన్స్ కేసు: అవతలి వ్యక్తి అడ్రస్ తెలియకపోతే ఏం చేయాలి

**(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)**




చాలామంది చెక్ బౌన్స్ అయినప్పుడు, అవతలి వ్యక్తి అడ్రస్ మారిపోయినా లేదా తెలియకపోయినా కేసు వేయలేమని ఆగిపోతారు. కానీ చట్టంలో దీనికి పరిష్కారాలు ఉన్నాయి. 1. బ్యాంక్ ద్వారా వివరాలు పొందవచ్చు: మీ దగ్గర చెక్ బౌన్స్ మెమో (రిటర్న్ మెమో) ఉంది కాబట్టి, మీ అడ్వకేట్ ద్వారా సదరు బ్యాంక్ మేనేజర్‌కు లెటర్ రాయవచ్చు. లేదా కేసు ఫైల్ చేసినప్పుడు బన్స్ సెక్షన్ 91 (పాత సి ర్ పి సి 91) కింద కోర్టు ద్వారా ఆ వ్యక్తి యొక్క కే వై సి వివరాలు (ఆధార్ అడ్రస్, ఫోన్ నంబర్) తెప్పించుకోవచ్చు. 2. 'లాస్ట్ నోన్ అడ్రస్ట కు నోటీసు: అతను గతంలో ఎక్కడ ఉన్నాడో ఆ అడ్రస్‌కే లీగల్ నోటీసు పంపండి. ఒకవేళ నోటీసు అందకుండా తిరిగి వచ్చినా (రిటర్న్డ్ రిఫ్యూస్డ్/లెఫ్ట్), ఆ రశీదుతో మీరు కేసు ముందుకు తీసుకెళ్లవచ్చు. 3. పేపర్ పబ్లికేషన్ (సబ్స్టిట్యూటెడ్ సర్వీస్): వ్యక్తి ఆచూకీ అస్సలు దొరకనప్పుడు, కోర్టు అనుమతితో ఒక ప్రముఖ దినపత్రికలో నోటీసు ప్రచురించవచ్చు. పత్రికలో ప్రకటన వస్తే అది అతనికి అందినట్టుగానే కోర్టు పరిగణిస్తుంది. 4. డిజిటల్ నోటీసులు: సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఇప్పుడు వాట్సాప్ (వాట్సాప్) లేదా ఈమెయిల్ ద్వారా కూడా నోటీసులు పంపవచ్చు. బ్లూ టిక్ లేదా డెలివరీ రిపోర్ట్‌ను సాక్ష్యంగా చూపవచ్చు. గమనిక (చాలా ముఖ్యం): లి చెక్ బౌన్స్ అయిన 30 రోజుల్లోపు లీగల్ నోటీసు పంపాలి. నోటీసు పంపిన తర్వాత కూడా డబ్బులు చెల్లించకపోతే, 45 రోజుల్లోపు కోర్టులో కేసు వేయాలి. అడ్రస్ కోసం వెతుకుతూ ఈ గడువు (లిమిటేషన్ పీరియడ్) మించకుండా చూసుకోండి.

## వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని సకుటుంబ సమేతంగా దర్శించుకున్న దాస్యం వినయ్ భాస్కర్






**వేములవాడ, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రసిద్ధ క్షేత్రం వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ సకుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని కోడెను కట్టేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని భీమేశ్వర ఆలయం లో శివలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పూజల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. పూజల అనంతరం వేద పండితులు దాస్యం వినయ్ భాస్కర్ కి కండువా కప్పి, వస్త్రాలు, ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ దర్శనం సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సమేత దర్శనం భక్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## వివేకానంద మాటలు స్ఫూర్తినిస్తాయి

**అదనపు డీసీపీ సురేష్ కుమార్**



**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్):**

రాఋఎఆ ఎఆఅజవఎఋఖఋఅఋ మాటలు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం నింపి జీవితంలో ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని అదనపు డీసీపీ సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ముందుగా స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అదనపు డీసీపీ ఏ.ఆర్. మాట్లాడుతూ, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని అన్నారు. యువతకు మార్గదర్శకంగా నిలిచే ఆయన బోధనలు నేటి సమాజానికి మరింత అవసరమని, ముఖ్యంగా క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను అలవరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలీసు విభాగంలో పని చేసే ప్రతి ఒక్కరు స్వామి వివేకానందుడి ఆదర్శాలను అనుసరించి ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలతో సానుకూల సంబంధాలు ఏర్పరుచుకోవడంలో ఆయన బోధనలు మార్గదర్శకంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీలు డేవిడ్ రాజు, జాన్ నర్సింహులు, నాగయ్య, అంతయ్య, ఆర్.ఐలు స్పర్జన్ రాజ్, శ్రీధర్, సతీష్, చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చైనా మాంజా చుట్టుకుని తీవ్రంగా గాయపడిన టెక్కీ

**బైక్ పై వెళుతున్న చైతన్య అనే టెక్కీకి చుట్టుకున్న చైనా మాంజా**
**బాధితుడిని మాదాపూర్‌లోని ఆసుపత్రికి తరలించిన స్థానికులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

నిషేధిత చైనా మాంజా మరో ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నుంచి హఫీజ్‌పేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చైతన్య అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేతికి మాంజా చుట్టుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆయన చేయి తెగింది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మాదాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, అవగాహన లోపంతో కొందరు వినియోగిస్తుండటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పతంగులు ఎగురవేసే సమయంలో మాంజా తెగి రోడ్లపై గాలిలో వేలాడుతూ వాహనదారులకు ముప్పుగా మారుతోంది. చైనా మాంజా కారణంగా గతంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. దీంతో దేశంలో చైనా మాంజాపై ప్రభుత్వాలు నిషేధం విధించాయి. అయినప్పటికీ వీటి అమ్మకాలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో చిన్నా పెద్దా పతంగులు ఎగురవేస్తూ ఆనందిస్తున్న సమయంలో ఈ చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

# అమ్మవారిపేట జాతర ఏర్పాట్లను విస్తృతంగా సమీక్షించిన సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత





**వరంగల్, జనవరి 12 (జై భీమ్ న్యూస్)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట గ్రామంలో ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న శ్రీ మేడారం (సమ్మక్క--సారలమ్మ) జాతర ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత స్వయంగా గ్రామాన్ని సందర్శించి విస్తృతంగా సమీక్షించారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై పోలీస్ అధికారులు, జాతర కమిటీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. జాతర నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాల వివరాలు, ప్రతిరోజూ వచ్చే భక్తుల అంచనా సంఖ్య, యాత్రికుల రాకపోకలకు అనుసరించాల్సిన మార్గాలు, గత సంవత్సరాల్లో ఎదురైన సమస్యలు, అనుకోని ఘటనలు చోటుచేసుకున్నాయా లేదా అనే అంశాలను డీసీపీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆలయ పరిసరాలు, గ్రామ ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తులు బస చేసే ప్రదేశాలను పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ లైటింగ్, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యం, ఫైర్ సేఫ్టీ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని డీసీపీ ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అదనపు పోలీస్ బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక భద్రత కల్పించడంతో పాటు తప్పిపోయిన భక్తుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ దార కవిత మాట్లాడుతూ, అమ్మవారిపేట గ్రామంలో స్వయంభువుగా వెలిసిన సమ్మక్క--సారలమ్మలను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈసారి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పాటు క్రమబద్ధమైన క్యూ లైన్లు, ప్రత్యేక ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జాతర పూర్తిగా శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికతో రహదారి మళ్లింపులు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాల కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 24 గంటల పాటు పోలీస్ బృందాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, "జాతర సమయంలో శాంతిభద్రతల పరిరక్షణే మా ప్రధాన లక్ష్యం. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణను పక్కాగా అమలు చేస్తాం. పోలీస్ శాఖ, జాతర కమిటీ, గ్రామ ప్రజల సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహిస్తాం" అని తెలిపారు. అలాగే మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, "జాతర ప్రాంతంలో పోలీస్ పికెట్లు, నైట్ పట్రోలింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు పోలీస్ సూచనలు పాటిస్తూ సహకరిస్తే ఎలాంటి సమస్యలు లేకుండా జాతర ప్రశాంతంగా జరుగుతుంది" అని అన్నారు. ఈ సమీక్ష కార్యక్రమంలో డీసీపీ దార కవితతో పాటు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, పోలీస్ అధికారులు, ఎస్ఐ రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, ఆలయ చైర్మన్ కోడూరి భిక్షపతి, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జాతరను ప్రశాంతంగా, భక్తుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ, ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# నాలుగేళ్ల తర్వాత అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు విద్యుత్ సౌకర్యం





**జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ, జై భీమ్ పత్రికకు కృతజ్ఞతలు తెలిపిన వైద్యఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు**
**కమలాపూర్ పిహెచ్సీ పరిధిలో డీఎంహెచ్ఓ అప్పయ్య ఆకస్మిక తనిఖీ -- ప్రజలకు మెరుగైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**

**కమలాపూర్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖధికారి అప్పయ్య సోమవారం రోజున కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంబాల గ్రామంలో ఉన్న అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రానికి ఇటీవల కల్పించిన విద్యుత్ సరఫరా పనులను ఆయన స్వయంగా పరిశీలించి, నాలుగేళ్లుగా కరెంటు లేకుండా కొనసాగిన పరిస్థితుల వల్ల గ్రామ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై లోతుగా సమీక్షించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యం అత్యంత కీలకమని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు వైద్య సేవలు పొందడంలో తీవ్రమైన అసౌకర్యాలు ఎదుర్కొన్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యాక్సిన్లను అవసరమైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయలేకపోవడం వల్ల టీకా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంలో అడ్డంకులు ఏర్పడ్డాయని వివరించారు. ఈ పరిస్థితి తల్లి--శిశు ఆరోగ్య సేవలపై ప్రతికూల ప్రభావం చూపిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలపై జై భీమ్ పత్రిక వరుస కథనాలు ప్రచురించడంతో పాటు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, గ్రామ ప్రజలు నేరుగా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి అప్పయ్య దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈ అంశాలను జిల్లా కలెక్టర్‌కు వివరించగా, వారి అనుమతితో అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు విద్యుత్ సరఫరా కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడటంతో గ్రామ ప్రజలు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు, డీఎంహెచ్ఓకు, జై భీమ్ పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రహరీ (ఫెన్సింగ్) లేకపోవడం వల్ల భద్రతాపరమైన సమస్యలు ఏర్పడుతున్నాయని, రోజువారీ కార్యకలాపాలు నిర్వహించడంలో సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్యాధికారి మరియు సిబ్బంది డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్ఓ, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని, వీలైనంత త్వరగా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. సిబ్బంది సేవాభావంతో పనిచేసి గర్భిణీలు, పిల్లలు, వృద్ధులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో వ్యాక్సిన్ నిల్వ సక్రమంగా ఉండటం, రాత్రి వేళల్లో కూడా వైద్య సేవలు అందించడం, అత్యవసర పరిస్థితుల్లో చికిత్స మరింత సులభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. డీఎంహెచ్ఓ అప్పయ్య మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే ప్రజలకు మొదటి ఆశ్రయం. అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గర్భిణీలు, పిల్లలు, వృద్ధులకు మెరుగైన సేవలు అందించగలుగుతాం. వ్యాక్సిన్ నిల్వలు సురక్షితంగా ఉండటంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో కూడా తక్షణ వైద్యం అందే అవకాశం ఉంటుంది. ప్రతి ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. సిబ్బంది ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవాభావంతో పనిచేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. కమలాపూర్ మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ "అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు విద్యుత్ సౌకర్యం రావడం మా కేంద్రానికి ఎంతో ఊరట. టీకా కార్యక్రమాలు, గర్భిణీ మహిళల పరీక్షలు, అత్యవసర సేవలు ఇక నిరాటంకంగా నిర్వహించగలుగుతాం. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో డీఎంహెచ్ఓ గారి సహకారం మరువలేనిది" అని తెలిపారు. డెమో వి. అశోక్ రెడ్డి మాట్లాడుతూ "నాలుగేళ్లుగా కరెంటు లేకపోవడంతో వ్యాక్సిన్ నిల్వ, రికార్డుల నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పుడు విద్యుత్ సౌకర్యం కలగడంతో మా పనులు సులభమయ్యాయి. దీనికి సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, డీఎంహెచ్ఓకు, జై భీమ్ పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని అన్నారు. ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్ మానస మాట్లాడుతూ "విద్యుత్ సదుపాయం అందుబాటులోకి రావడంతో తల్లి--శిశు ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడతాయి. రాత్రి వేళల్లో కూడా అవసరమైన వైద్యం అందించగలుగుతాం. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మేమంతా సమన్వయంతో పనిచేస్తాం" అని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు షన్ను, కవిత, సరళ, ఇందిరా, రమాదేవి తదితర వైద్య సిబ్బంది, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామీణ ఆరోగ్య సేవల్లో చోటుచేసుకున్న ఈ మార్పు ప్రజలకు పెద్ద ఊరటగా మారిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# నవ్యాంధ్ర 'పవర్ణ పాలిటిక్స్

### అగ్రదేశాల బాటలో గ్రీన్ ఎనర్జీ విప్లవం!

**(ఆంధ్రప్రదేశ్ జై భీమ్ న్యూస్)**

ఒకప్పుడు చీకటి రాత్రులు, అర్ధరాత్రి కరెంటు కోతలతో కునారిల్లిన ఆంధ్రప్రదేశ్, నేడు ఇంధన రంగంలో ప్రపంచానికే వెలుగులు పంచే స్థాయికి ఎదుగుతోంది. ఇది కేవలం పవర్ ప్లాంట్ల నిర్మాణం మాత్రమే కాదు, ఒక రాష్ట్రం తన భౌగోళిక అనుకూలతలను ఆయుధంగా మార్చుకుని, ఆర్థిక స్వయంసమృద్ధిని చాటుకుంటున్న తీరు. అమెరికాలోని టెక్సాస్, ఆస్ట్రేలియాలోని అడిలైడ్, చైనాలోని జెజియాంగ్ వంటి ప్రాంతాల్లో మనం చూస్తున్న ఆధునిక ఇంధన విప్లవం, నేడు మన తెలుగు గడ్డపై.. ముఖ్యంగా రాయలసీమ కొండల పైనా, కోస్తా తీరప్రాంతాల్లోనూ సాక్షాత్కరిస్తోంది.

**సూర్యరశ్మి: రాష్ట్రానికి వరప్రసాదం..**

ఆంధ్రప్రదేశ్ ఇంధన వ్యూహంలో సౌర విద్యుత్ (సోలార్ ఎనర్జీ) వెన్నెముక లాంటిది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని అపారమైన బంజరు భూములు నేడు 'బంగారు గనులు'గా మారుతున్నాయి. కర్నూలులోని అల్ట్రా మెగా సోలార్ పార్క్ వంటి ప్రాజెక్టులు ప్రపంచంలోనే అతిపెద్ద వాటిలో ఒకటిగా నిలిచి, చైనాలోని భారీ సోలార్ ఫార్మ్లకు ధీటుగా నిలవబోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో అన్నింటికంటే చవకైన విద్యుత్ సౌర శక్తి నుండే లభిస్తోంది. పగటిపూట లభించే ఈ అపారమైన శక్తిని ఒడిసిపట్టడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం థర్మల్ ప్లాంట్లపై ఆధారపడటాన్ని తగ్గించి, కాలుష్య రహిత భవిష్యత్తుకు బాటలు వేయబోతోంది.

**ప్రకృతి ఒడిలో పుట్టిన చవకైన శక్తి..**

సౌర శక్తితో పాటు, రాయలసీమలో కొండల పైన వీచే గాలిని మలచుకుంటూ పవన విద్యుత్ (విండో పవర్) ప్రాజెక్టులు వేగంగా విస్తరిస్తున్నాయి. పగలు సోలార్, రాత్రి పూట విండ్ పవర్ ఉత్పత్తి చేసేలా 'హైబ్రిడ్ణ నమూనాను ఏపీ ప్రోత్సహిస్తోంది. వీటికి తోడుగా, రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తున్న పోలవరం జలవిద్యుత్ కేంద్రం పూర్తయితే, అక్కడ ఉత్పత్తి అయ్యే 960 మెగావాట్ల విద్యుత్ నిర్వహణ ఖర్చు చాలా తక్కువ కాబట్టి, అది అత్యంత పొదుపైన వనరుగా మారబోతోంది. ఇది రాష్ట్ర ఇంధన చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం.

**అగ్రదేశాల వ్యూహం.. ఏపీ అమలు!**

ప్రపంచంలోనే ఇంధన నిల్వ (ఎనర్జీ స్టోరేజ్) లో చైనా దిగ్గజంగా ఉంటే, ఆ వ్యూహాన్ని ఏపీ తనదైన శైలిలో అమలు చేస్తోంది. చైనా ఏ విధంగానైతే 'పంప్డ్ హైడ్రో స్టోరేజ్ణ (ప్రొస్ప) ను వాడుతుందో, అదే సాంకేతికతతో భారీ 'వాటర్ బ్యాటరీ'లను ఏపీ నిర్మిస్తోంది. పగటిపూట సోలార్ ద్వారా లభించే మిగులు విద్యుత్తుతో నీటిని పైకి పంప్ చేయడం, రాత్రిపూట ఆ నీటితో విద్యుత్ తీయడం ద్వారా నిరంతర విద్యుత్ సరఫరాను ఏపీ సాకారం చేయబోతోంది. మరోవైపు అమెరికాలోని టెక్ కంపెనీలు గ్రీన్ ఎనర్జీ కోసం చేస్తున్న ప్రయత్నాలను మనం ఏపీలోనూ చూస్తున్నాం. గూగుల్ (గూగుల్) మరియు అదానీ గ్రూప్ మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందమే దీనికి నిదర్శనం. విశాఖపట్నంలో ప్రపంచస్థాయి ఏఐ (ఏ ఐ) డేటా సెంటర్ల నిర్వహణకు అవసరమైన గ్రీన్ ఎనర్జీని ఏపీలోని సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టులే అందించబోతున్నాయి. ఇది ఏపీని గ్లోబల్ టెక్ మ్యాప్లో అగ్రరాజ్యాలకు ధీటుగా నిలబెడుతోంది.

**ఇంధన ప్రజాస్వామ్యీకరణ: ప్రతి ఇల్లూ ఒక గని!..**

విద్యుత్ అంటే కేవలం కొన్ని సంస్థల గుత్తాధిపత్యం కాదు, అది ప్రజల సొత్తు కావాలి. ఇదే 'ఎనర్జీ డెమొక్రటైజేషన్ణ. పి.ఎం సూర్య ఘర్ పథకం ద్వారా లక్షలాది ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ వేయడం ద్వారా, సామాన్యుడు తన కరెంటును తనే తయారు చేసుకుని, మిగిలిన దానిని అమ్మి ఆదాయం పొందే స్థాయికి చేరుకుంటున్నాడు. ఇది కేవలం బిల్లులు తగ్గించుకోవడం కాదు, ఒక సాధారణ గృహిణిని, ఒక రైతును శక్తివంతునిగా మార్చే ప్రయత్నం. సుమారు 30 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోంది.

**భవిష్యత్తుపై కొత్త ఆశ..**

పోలవరం ప్రాజెక్టు పూర్తికావడం, పవన-సౌర విద్యుత్తుల అనుసంధానం, మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల రాకతో ఆంధ్రప్రదేశ్ 'ఇండియా పవర్ హౌస్ణ గా అవతరించబోతోంది. ఇతర రాష్ట్రాల నుండి విద్యుత్ కొనే స్థితి నుండి, ఇతర రాష్ట్రాలకు విద్యుత్ అమ్మి లాభాలు గడించే స్థితికి మనం చేరుకోబోతున్నాం. ఇది కేవలం విద్యుత్ విజయం కాదు, ఐదు కోట్ల ఆంధ్రుల ఆర్థిక ఆత్మవిశ్వాసం!. పవర్ ఉంటే పెట్టుబడులు వస్తాయి. సెమీకండక్టర్ లాంటి రంగాలు వద్దంటే వస్తాయి.




## రూ.20 లక్షలతో ఊకల్లో పల్లె దవాఖాన

# ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**రాయపర్తి, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాయపర్తి మండలంలోని ఊకల్ గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్.హెచ్.ఎం) నిధుల కింద రూ. 20 లక్షల వ్యయంతో మంజూరైన పల్లె దవాఖానను పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ--- పల్లె దవాఖానల ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చికిత్స పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేస్తూ, రాయపర్తి మండల అభివృద్ధికి అవసరమైన అన్ని రంగాల్లో కట్టుబడి పనిచేస్తాం అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య--ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక సర్పంచులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఈ దేశాన్ని మార్చేది - ఈ సమాజాన్ని నడిపేది యువతే : గోస్కుల అజయ్

**హుజురాబాద్, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోస్కుల అజయ్ (స్టేట్ ఎస్. ఎఫ్.డి కో - కన్వీనర్) మాట్లాడుతూ --- 1863 జనవరి 12న జన్మించిన స్వామి వివేకానంద చిన్న వయసులోనే ఆధ్యాత్మికతకు అలవాటు పడి, శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడిగా సన్యాసం స్వీకరించి భారతదేశ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ముఖ్యంగా చికాగోలో జరిగిన ధర్మ సభలో వివేకానంద చేసిన ఉపన్యాసాలు ప్రపంచ ప్రజలను ఆకర్షించి, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంచాయని గుర్తు చేశారు. "ఈ దేశాన్ని మార్చేది, ఈ సమాజాన్ని నడిపేది యువతే" అనే సత్యాన్ని వంద సంవత్సరాల క్రితమే ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. "లేచి రండి యువకులారా లక్ష్యం చేరేవరకు ఆగకండి" అని పిలుపునిస్తూ, విద్యార్థి అంటే కేవలం పుస్తకాలకే పరిమితమైన వ్యక్తి కాదని, దేశ భవిష్యత్తును మోసే యోధుడని వివేకానంద స్పష్టం చేశారని అన్నారు. నేటి కాలంలో విద్య వ్యాపారంగా మారడం, యువతను దారి తప్పించే శక్తులు పెరుగడం, జాతీయ భావనను కించపరిచే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో--- వివేకానందుని భావజాలంతో, దేశభక్తితో విద్యార్థి సమస్యలపై పోరాడే ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన వంద మంది యువకులను ఇస్తే ఈ ప్రపంచాన్ని మార్చేస్తాను" అన్న వివేకానంద మాటలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పల్లెకు, ప్రతి గుండెకు మన సంస్కృతి--సాంప్రదాయాలు చేరేలా విద్యార్థులు సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జీవిత చరిత్రను తెలుసుకొని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశం--సమాజం కోసం సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోస్కుల అజయ్ (స్టేట్ ఎస్.ఎఫ్.డి కో - కన్వీనర్), నగర సంయుక్త కార్యదర్శి సిద్ధు, రాంచరణ్, అఖిల్, రతుల్ భార్గవ్, అబ్బో, మారుతి, విజయ్ తదితరులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




## కాకతీయ యూనివర్సిటీలో మహిళా క్రికెట్ సెలక్షన్స్





**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఈ రోజు కాకతీయ యూనివర్సిటీలో మహిళా క్రికెట్ సెలక్షన్స్ ఘనంగా నిర్వహించబడ్డాయి. 12 జనవరి రోజున జరిగిన ఈ సెలక్షన్స్కు యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల నుంచి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుండి మొత్తం 40 మంది మహిళా క్రికెట్ క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్ను కేఎయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య ఘనంగా ప్రారంభించారు. స్పోర్ట్స్ బోర్డు, కేఎయూ వరంగల్ ఆధ్వర్యంలో ఈ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించబడ్డాయి. ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ వై. వెంకయ్య బ్యాటింగ్ చేయగా, కేఎయూ ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్. కుమార్ బౌలింగ్ వేసి సెలక్షన్స్కు శ్రీకారం చుట్టారు. ఈ సెలక్షన్స్లో ఎంపికైన క్రీడాకారిణులు కాకతీయ యూనివర్సిటీ జట్టుగా అన్నా యూనివర్సిటీలో నిర్వహించనున్న మహిళా సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొంటారని సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య మరియు ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్. కుమార్ తెలిపారు. ఈ పోటీలకు 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారిణులు మాత్రమే అర్హులని వారు స్పష్టం చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకయ్యతో పాటు డా. ఎస్. కుమార్, డా. సోమన్న (ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షులు), మట్టెడా కుమార్, ఎర్ర సుమన్, డా. వెంకన్న, అఫ్జల్ అన్వేష్, వెన్నెల, శ్వేత, సందీప్, పీడీ గోపి తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ - వరంగల్ జిల్లాలను ఒకటిగా పునర్వ్యవస్థీకరించాలి: ఆకుల రాజేందర్




**వరంగల్, 12 జానవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా ఉండటంతో, ముఖ్యంగా ఆరు జిల్లాలుగా విభజించడంవల్ల ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలంగాణ ఎన్జీఓల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు, జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ పేర్కొన్నారు. జిల్లాల విభజన కారణంగా ఉద్యోగులు స్థానికత కోల్పోవడం, కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించాల్సి రావడం, ప్రమోషన్లలో సీనియారిటీ నష్టం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా జిల్లాల విభజన ఆధారంగా అమలు చేసిన జోనల్ విధానం వల్ల కూడా ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగులను వేర్వేరు జిల్లాలు, జోన్లకు కేటాయించడంవల్ల వారి సర్వీస్కు సంబంధించిన అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాకుండా ఉన్నాయని తెలిపారు. కావున జిల్లాల విభజనతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలను పునర్వ్యవస్థీకరించాలని, ఈ ప్రక్రియలో ఉద్యోగుల సమస్యలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని ఆకుల రాజేందర్ కోరారు. ఈ అంశాలను నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలు భౌతికంగా కలిసే ఉండటంతో, ఈ రెండు జిల్లాలను ఒకటిగా కలపడం ద్వారా ప్రజలకు మరియు ఉద్యోగులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇలా చేయడం వల్ల ఈ రెండు జిల్లాల ఉద్యోగుల సమస్యలు కొంతమేరకు అయినా పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకే హనుమకొండ--వరంగల్ జిల్లాలను కలపాలనే ప్రతిపాదనను హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ స్వాగతిస్తుందని జిల్లా కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపింది.

## సంధ్య థియేటర్ ఘటన తర్వాత టిక్కెట్ ధరలపై ఆ మాట చెప్పింది వాస్తవమే కానీ: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సినిమా టిక్కెట్ ధరల పెంపుపై తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సంధ్య థియేటర్ ఘటన అనంతరం టిక్కెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మాట వాస్తవమేనని ఆయన అన్నారు. ఆ తర్వాత అందరం కూర్చుని చర్చించి, ఆ నిర్ణయాన్ని సవరించామని తెలిపారు. టిక్కెట్ ధరలు పెంచవలసి వస్తే, 20 శాతం సినిమా కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలనే షరతు విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు కొన్ని సినిమాలకు టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అయితే, దీనిపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. నల్గొండ, భువనగిరి జిల్లాలలో పర్యటిస్తున్న సమయంలో ఒక సినిమా టిక్కెట్ ధరలను పెంచుతూ జీవో వచ్చిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో తాను మరో కార్యక్రమంలో ఉన్నానని వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఏ శాఖల వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోరని, అందరినీ కలుపుకుని ముందుకు సాగుతారని ఆయన వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి రెండు రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గతంలోనూ, ప్రస్తుతం సినిమా టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.

జై భీమ్ POWER OF PEOPLE

# తెలంగాణలో కాంగ్రెస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదు

**అసలు ఫైట్ మాతోనే: కేటీఆర్**
**తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తి కాదన్న కేటీఆర్**
**అసలు రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యేనని ఉద్ఘాటన**
**కాంగ్రెస్ 24 నెలల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**
**పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కేవలం గాలివాటమేనని వ్యాఖ్య**
**మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నేత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కూడా పాల్గొన్నారు.

# ఎన్నికల హామీ నెరవేర్చేందుకు 300 కుక్కలను చంపించిన సర్పంచ్‌లు

**హనుమకొండ జిల్లాలో ఘటన**
**ఎన్జీవో ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**
**పూడ్చిపెట్టిన కళేబరాలను వెలికి తీసి పోస్ట్ మార్టం**
**రెండు గ్రామాల సర్పంచ్ లు, గ్రామస్థులపై కేసు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

వీధి కుక్కల బెడద తప్పిస్తానని సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు హామీ ఇచ్చారు.. ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ హామీని నిలబెట్టుకున్నారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని వీధికుక్కలకు విషపు ఇంజక్షన్లు ఇచ్చి చంపించారు. సుమారు 300 కుక్కలను చంపించి ఊరవతల ఖాళీ ప్రదేశంలో పాతిపెట్టారు. హనుమకొండ జిల్లా శాయంపేట, ఆరేపల్లి గ్రామాల్లో చోటుచేసుకుందీ దారుణం. ఈ విషయం తెలిసి 'స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' అనే ఎన్జీవో సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక గ్రామ సర్పంచులు, కార్యదర్శులపై ఆ సంస్థ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్ర మాజీమంత్రి మేనకాగాంధీ కూడా జోక్యం చేసుకున్నారు. వీధికుక్కలను అత్యంత అమానవీయంగా చంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈ దారుణానికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఎన్జీవో ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆ రెండు గ్రామాల శివార్లలో పాతిపెట్టిన వీధికుక్కల కళేబరాలను వెలికి తీసి పశు వైద్యశాలలో పోస్ట్ మార్టం నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి శాయంపేట, ఆరేపల్లి గ్రామాల సర్పంచ్ లు, కార్యదర్శులతో పాటు మొత్తం 9 మంది పై జంతు సంరక్షణ చట్ట ప్రకారం కేసులు నమోదు చేశారు. కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారనే.. వీధి కుక్కలు రెచ్చిపోయి దాడులు చేస్తున్నాయని, కుక్క కాటు బాధితుల సంఖ్య పెరిగిపోతుందనే కుక్కలను చంపించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. తమ గ్రామంలోని వీధి కుక్కలకు స్కిన్ డిసీజ్ ఉండడం వల్ల తాము వ్యాధుల బారిన పడుతున్నామని వివరించారు.

# హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని అవుతారన్న ఒవైసీ
# అదిరిపోయే కౌంటర్ ఇచ్చిన బండి సంజయ్

**హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని అవుతారన్న ఒవైసీ వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్ర స్పందన**
**ముందు మీ పార్టీకి బురఖా ధరించిన మహిళను అధ్యక్షురాలిని చేయాలని సవాల్**
**ఎంఐఎం పార్టీ ఎంతమంది ముస్లిం మహిళలకు టికెట్లు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్న**
**ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు బీజేపీ న్యాయం చేసిందని వెల్లడి**
**సాధికారత అంటూనే ఒవైసీ మహిళలపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపణ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

భవిష్యత్తులో హిజాబ్ ధరించిన మహిళ భారత ప్రధాని అవుతారంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కావడం గురించి కలలు కనే ముందు, బురఖా ధరించిన మహిళను మీ పార్టీకి అధ్యక్షురాలిగా నియమించే ధైర్యం చూపాలని ఆయన ఒవైసీకి సవాల్ విసిరారు. ఆదివారం నాడు 'ఎక్స్' వేదికగా బండి సంజయ్ ఈ మేరకు స్పందించారు. "ఎంఐఎం పార్టీ ఇప్పటివరకు ఎంతమంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్లు ఇచ్చింది? పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే పదవుల్లో ఎంతమంది మహిళలు ఉన్నారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం నినాదాలతో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినట్టు కాదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో పాతబస్తీలో అక్బరుద్దీన్ ఒవైసీపై బీజేపీ తరఫున షాజాదీ సయ్యద్‌ను నిలబెట్టామని, అప్పుడు ఆమెను బెదిరించి ఓడించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె జాతీయ మైనారిటీ కమిషన్‌లో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. సాధికారత గురించి మాట్లాడే ఒవైసీ, పార్టీలోనూ, ఇంట్లోనూ మహిళలపై ఆంక్షలు విధిస్తారని సంజయ్ విమర్శించారు. ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళల పేరిట సంక్షేమ పథకాలు, గ్యాస్ కనెక్షన్లు, గృహాలు వంటి సంస్కరణలతో ముస్లిం మహిళలకు నిజమైన సాధికారతను అందించింది బీజేపీ ప్రభుత్వమేనని బండి సంజయ్ పేర్కొన్నారు. చాలామంది ముస్లిం మహిళలు ప్రధాని మోదీని తమ సోదరుడిగా భావిస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమాన హోదా కల్పించిందని, అందుకే పాకిస్థాన్‌లా కాకుండా ఇక్కడ హిజాబ్ ధరించిన మహిళ కూడా ప్రధాని కాగలరని అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# సంక్రాంతి రద్దీ

**చర్లపల్లి-అనకాపల్లి మధ్య మరో 3 ప్రత్యేక రైళ్లు**
**హైదరాబాద్‌లోని చర్లపల్లి - అనకాపల్లి మధ్య కొత్త సర్వీసులు**
**ఇప్పటికే 170కి పైగా ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ**
**సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**
**సికింద్రాబాద్‌లో తాత్కాలికంగా పార్కింగ్ నిలిపివేత**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి మధ్య మూడు కొత్త ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆదివారం వెల్లడించింది. రైల్వే శాఖ తెలిపిన వివరాల ప్రకారం... రైలు నంబర్ 07479 అనకాపల్లి-చర్లపల్లి ప్రత్యేక రైలు జనవరి 18న రాత్రి 10:30 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11:30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07477 చర్లపల్లి-అనకాపల్లి సర్వీసు జనవరి 19న అర్ధరాత్రి 12:40 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 9 గంటలకు అనకాపల్లికి చేరుకుంటుంది. ఇక మూడో రైలు (07478) జనవరి 19న రాత్రి 10:30 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11:30కి చర్లపల్లికి వస్తుంది. ఇప్పటికే సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య 4, హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ప్రకటించింది. మొత్తం మీద విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, నరసాపురం వంటి ఏపీలోని కీలక ప్రాంతాలకు 170కి పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. మరో 130 ప్రత్యేక రైళ్లు ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇతర రాష్ట్రాలకు ప్రయాణిస్తాయి. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్, చర్లపల్లి, లింగంపల్లి స్టేషన్లలో రైల్వే శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్‌లో రోజుకు సగటున 2.20 లక్షల మంది ప్రయాణికులు వస్తారని అంచనా. దీంతో అదనపు టీటీఈలు, ఆర్పీఎఫ్ సిబ్బందిని మోహరించారు. 24 గంటల పాటు పనిచేసే సీసీటీవీ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనుల కారణంగా పార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు ఉన్న బోయిగూడ ప్రవేశ ద్వారం వద్ద యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్‌ను తాత్కాలికంగా ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు.

# వారు చీకట్లో మిగిలిపోయారు...

**తెలంగాణ మెరిసిపోతోంది: కేటీఆర్**
**యాదాద్రి ప్లాంట్ నాలుగో యూనిట్ లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం**
**తెలంగాణ విద్యుత్ రంగంలో మైలురాయి అని కేటీఆర్ కితాబు**
**కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారిందని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మునిగిపోతుందని ఆనాడు కొందరు అసత్యాలు ప్రచారం చేశారని... ఆ మాటలను తెలంగాణ పటాపంచలు చేసిందని అన్నారు. ఆనాడు అసత్యాలు ప్రచారం చేసిన వారే ఇప్పుడు చీకట్లో మిగిలిపోయారని, తెలంగాణ మాత్రం వెలుగుల్లో మెరిసిపోతోందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారిందని కేటీఆర్ అన్నాను. దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని పవర్ ప్రాజెక్టుల్లో ఒకటైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నాలుగో యూనిట్ లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందని చెప్పారు. ఇది తెలంగాణ విద్యుత్ రంగంలో పెద్ద మైలురాయి అని అన్నారు. కేసీఆర్ స్వప్నాన్ని సాకారం చేసిన విద్యుత్ శాఖ ఇంజినీర్లు, సిబ్బంది, భాగస్వాములందరికీ అభినందనలు తెలిపారు.

# బోరబండలో యువతి దారుణ హత్య

**ఓ పబ్‌లో పని చేస్తున్న సమయంలో యువతితో నిందితుడికి పరిచయం**
**యువతి మరో చోట పని చేయడం ప్రారంభించడంతో తగ్గిన మాటలు**
**తనను నిర్లక్ష్యం చేస్తోందంటూ హత్య చేసిన యువకుడు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ లో వరుస హత్యలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే చోటుచేసుకున్న పలు ఘటనలతో నగరవాసులు భయంతో ఉన్న వేళ, తాజాగా బోరబండ ప్రాంతంలో జరిగిన ఓ యువతి హత్య మరింత కలకలం రేపింది. చిన్న అనుమానం ఓ యువతి ప్రాణాలు తీసేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతురాలిని ఖనీజ్ ఫాతిమాగా గుర్తించారు. ఆమె గతంలో బంజారాహిల్స్‌లోని ఓ పబ్‌లో పనిచేసే సమయంలో జహీర్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారింది. అయితే కొంతకాలం క్రితం యువతి ఉద్యోగం మారి ఊర్వశి బార్‌లో పని చేయడం ప్రారంభించింది. దీంతో ఇద్దరి మధ్య మాట్లాడటం తగ్గిపోయింది. ఈ పరిస్థితిని జహీర్ తప్పుగా అర్థం చేసుకున్నాడు. తనను ఉద్దేశపూర్వకంగా దూరం పెడుతోందని, నిర్లక్ష్యం చేస్తోందని అనుమానంతో లోపలే లోపల కుంగిపోయాడు. అదే సమయంలో ఆమెపై ద్వేషం పెరిగింది. మాట్లాడుకుందామని చెప్పి యువతిని కలవడానికి పిలిచిన జహీర్, ఆ మాటల మధ్యే ఆమెపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా, విచారణ ప్రారంభించిన బోరబండ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ కాల్ రికార్డుల ప్రకారం నిందితుడిని గుర్తించారు. ప్రస్తుతం అతడిని విచారిస్తూ హత్యకు గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి





**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
**మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలి**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**హన్మకొండ, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణ పురోగతిపై ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. జిల్లాల వారీగా భూసేకరణ, నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్లు తరచుగా నిర్మాణ పనులపై సమీక్షలు చేస్తూ, క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలన చేపట్టాలని సూచించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై సీఎస్ ఆదేశాలు..**

అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన సిబ్బంది, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల ఏర్పాటు, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఫోటో ఎలక్టోరల్ జాబితాలు, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల వివరాలపై జిల్లాల వారీగా సీఎస్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

**హనుమకొండ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు – కలెక్టర్ స్నేహ శబరీష్**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సీఎస్ ప్రశ్నించగా, పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉన్నాయని తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే ప్రదర్శించామని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించి తుది ఓటర్ల జాబితా ప్రకటించినట్లు వివరించారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, రిటర్నింగ్ అధికారుల నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు సిద్ధం చేశామని, మున్సిపల్ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణతో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాంతక కడుపు క్యాన్సర్‌పై గెలుపు

**మెడికవర్ హాస్పిటల్‌లో విజయవంతమైన క్లిష్ట శస్త్రచికిత్స**

**వరంగల్, 12 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్ మరోసారి తన వైద్య నైపుణ్యాన్ని చాటుకుంది. ప్రాణాంతకమైన కడుపు క్యాన్సర్‌తో బాధపడుతున్న 55 ఏళ్ల వ్యక్తికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, అతడికి కొత్త జీవితం ప్రసాదించారు. కొన్ని వారాలుగా తీవ్రమైన కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్న రోగి మెడికవర్ హాస్పిటల్‌ను ఆశ్రయించగా, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. సునీల్ నాగుల ఆధ్వర్యంలో ఎండోస్కోపీ, సీటీ స్కాన్ వంటి ఆధునిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రారంభ దశలోనే స్టమక్ క్యాన్సర్ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం వల్ల శస్త్రచికిత్స ద్వారానే పూర్తిస్థాయి చికిత్స సాధ్యమని వైద్య బృందం స్పష్టం చేసింది. ఆంకాలజీ నిపుణుల సూచనల మేరకు డా. సునీల్ నాగుల నేతృత్వంలో టోటల్ గ్యాస్ట్రెక్టమీ విత్ డి2 లింఫ్ నోడ్ డిసెక్షన్ అనే అత్యంత సాంకేతికంగా క్లిష్టమైన శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. గంటల తరబడి సాగిన ఈ ఆపరేషన్ పూర్తిగా విజయవంతమై, ఆపరేషన్ అనంతరం రోగి ఆశించినదానికంటే వేగంగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. వరంగల్ ట్రైసిటీ పరిధిలో ఇలాంటి అధునాతన గ్యాస్ట్రో--ఇంటెస్టైనల్ క్యాన్సర్ శస్త్రచికిత్సలు కొద్ది కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండగా, మెడికవర్ హాస్పిటల్‌లో స్టమక్, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్లకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో చికిత్సలు అందుతున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు కూడా నాణ్యమైన క్యాన్సర్ వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. సునీల్ నాగుల మాట్లాడుతూ, “కడుపులో తరచూ నొప్పి, ఆకలి లేకపోవడం, తెలియని బరువు తగ్గడం, రక్తహీనత, తిన్న వెంటనే నిండిపోయిన భావన వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు” అని ప్రజలకు సూచించారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్స కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘మన శంకర వరప్రసాద్ గారు’ చిత్రానికి లీగల్ ప్రొటెక్షన్

**టాలీవుడ్ లో ఇదే ఫస్ట్ టైమ్!**
**చిరంజీవి ‘మన శంకర వరప్రసాద్గ సినిమాకు కోర్టు రక్షణ**
**ఫేక్ రేటింగ్స్, నెగెటివ్ ప్రచారాన్ని నిరోధించేందుకు కీలక ఆదేశాలు**
**బుక్‌మైషోలో రేటింగ్స్, రివ్యూస్ ఫీచర్ తాత్కాలికంగా నిలిపివేత**
**టాలీవుడ్‌లో ఇలాంటి చర్య తీసుకోవడం ఇదే మొదటిసారి**
**సంక్రాంతి కానుకగా జనవరి 12న సినిమా ప్రేక్షకుల ముందుకు**

**హైదఅబశ్రీశ్రీరాబాద్, జై భీమ్ న్యూస్**



మెగాస్టార్ చిరంజీవి కథనాయకుడిగా నటించిన ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమా విడుదలకు ముందే ఒక అరుదైన చర్యతో వార్తల్లో నిలిచింది. ఆన్‌లైన్‌లో జరిగే ఫేక్ రివ్యూలు, వ్యవస్థీకృత నెగెటివ్ ప్రచారానికి అడ్డుకట్ట వేసేలా ఈ చిత్ర బృందం కోర్టు నుంచి కీలక ఆదేశాలు పొందింది. టాలీవుడ్‌లో ఒక సినిమాకు ఇలాంటి న్యాయపరమైన రక్షణ కవచం లభించడం ఇదే తొలిసారి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 12న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. అయితే, ఇటీవలి కాలంలో సినిమాలను దెబ్బతీసేందుకు కొందరు బాట్లు, ఫేక్ అకౌంట్లతో రిలీజ్‌కు ముందే నెగెటివ్ రేటింగ్స్ ఇస్తున్న నేపథ్యంలో, నిర్మాతలు సుష్మితా కొణిదెల, సాహు గారపాటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. యాంటీ-పైరసీ సంస్థల సహాయంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ‘బుక్‌మైషో’లో ఈ సినిమాకు సంబంధించిన రేటింగ్స్, రివ్యూల విభాగాన్ని డిసేబుల్ చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం బుక్‌మైషోలో సినిమా పేజీలో అనే సందేశం స్పష్టంగా కనిపిస్తోంది. దీనివల్ల సినిమా విడుదలయ్యే వరకు ఎలాంటి రేటింగ్స్, రివ్యూలు పోస్ట్ చేయడానికి వీలుండదు. ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార నటిస్తుండగా, విక్టరీ వెంకటేశ్ ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. సంక్రాంతి బరిలో ‘ది రాజా సాబ్ల వంటి ఇతర పెద్ద సినిమాలతో పోటీ ఉన్నందున, నిర్మాతలు తీసుకున్న ఈ చర్య ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త ట్రెండ్ భవిష్యత్తులో ఇతర సినిమాలకు కూడా స్ఫూర్తిగా నిలవవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కాకతీయ విశ్వవిద్యాలయ వసతి గృహాలు

**ముల్కనూర్ ఉమెన్స్ కోఆపరేటివ్ మధ్య అవగాహనా ఒప్పందం**



**హన్మకొండ, 12 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం వసతి గృహాలు – ముల్కనూర్ ఉమెన్స్ కోఆపరేటివ్ సంస్థల మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. ఈ అవగాహనా ఒప్పందం ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సమక్షంలో కుదిరింది. వసతి గృహాల సంచాలకులు డాక్టర్ ఎల్. పి. రాజ్ కుమార్, ముల్కనూర్ ఉమెన్స్ కోఆపరేటివ్ సంస్థ ప్రతినిధులు భాస్కర్ రెడ్డి, నిరంజన్, మాధవ రెడ్డిలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఎంఓయూ ద్వారా విశ్వవిద్యాలయ వసతి గృహాలకు పాలు, పెరుగు సరఫరా చేయడానికి అవసరమైన నిబంధనలను ఖరారు చేసినట్లు రిజిస్ట్రార్ వివరించారు. ఈ ఒప్పందం ఒక సంవత్సరం కాలం అమల్లో ఉంటుందని, ఉత్పత్తి కేంద్రాల నుంచే నేరుగా వసతి గృహాలకు పాలు, పెరుగు సరఫరా జరుగుతుందని తెలిపారు. అవగాహనా ఒప్పందం ద్వారా సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని, బరువు, నాణ్యత విషయంలో ఒప్పంద నిబంధనల ప్రకారం ఖచ్చితంగా అమలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్, విశ్వవిద్యాలయ వసతి గృహాల చైర్మన్ ఆచార్య టి. మనోహర్, ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది: హరీశ్ రావు

**రేవంత్ నడుపుతోంది సర్కారా? సర్కస్ కంపెనీనా? అంటూ హరీశ్ రావు ఫైర్**
**కోమటిరెడ్డికి తెలియకుండానే సినిమా టికెట్ రేట్లపై జీవోలు వస్తున్నాయని విమర్శ**
**సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని మరిచారని ఆరోపణ**
**టికెట్ల దందా వెనుక ఓ రాజ్యాంగేతర శక్తి ఉందని సంచలన వ్యాఖ్యలు**
**ఈ వ్యవహారంపై గవర్నర్ విచారణ జరపాలని డిమాండ్**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి ‘నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు’ అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. “శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?” అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. “రేవంత్ రెడ్డి గారు, మీరు నడుపుతోంది సర్కారా లేక సర్కస్ కంపెనీనా?” అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను, ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. “పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?” అని ప్రశ్నించారు. “గత పదేళ్లు కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలి. ఒకరికి చుట్టం .. మరొకరికి శత్రుత్వం ఉండకూడదు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ఠ. మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమీషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతాం” అని అన్నారు. సినిమా టికెట్ల రేట్ల కమీషన్ల దందాపై గవర్నర్ తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా



## ‘మన శంకర వరప్రసాద్ గారు’ లో చిరంజీవి హుక్ స్టెప్ వెనుక ఉన్న కథ ఇదే!

లైట్స్ అన్నీ ఆఫ్ చేసి, కేవలం సెల్ ఫోన్ లైట్ వేసుకుని హుక్ స్టెప్ కంపోజ్ చేశామన్న సందీప్

మెగాస్టార్ చిరంజీవి డ్యాన్స్ అంటే అభిమానులకు ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. అయితే, ‘మన శంకరవరప్రసాద్ గారు’ చిత్రంలో థియేటర్లు దద్దరిల్లేలా చేసిన ‘హుక్ స్టెప్ సాంగ్ల వెనుక ఒక ఆసక్తికరమైన కథ దాగి ఉందని కొరియోగ్రాఫర్ ఆట సందీప్ వెల్లడించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నయనతార హీరోయిన్‌గా, వెంకటేశ్ కీలక పాత్రలో నటించిన చిత్రం ‘మన శంకర వరప్రసాద్ గారు’ సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్రంలో చిరంజీవి చేసిన డ్యాన్స్ స్టెప్స్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ‘హుక్ స్టెప్ సాంగ్’కు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన లభిస్తోంది. ఈ స్టెప్ ఇంతగా క్లిక్ కావడానికి కారణమైన ఆసక్తికర అంశాన్ని కొరియోగ్రాఫర్ ఆట సందీప్ తాజాగా పంచుకున్నారు. థియేటర్‌లో సినిమా చూసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మన అందరికీ ఏదో ఒక సమస్యలు ఉంటాయని, అదే విధంగా తనకు ప్రతి నెల ఈఎంఐలు కట్టే సమస్య ఉందని అన్నారు. ఈ పాటకు స్టెప్స్ కంపోజ్ చేస్తున్న సమయంలో ఈఎంఐ గుర్తు చేస్తూ వరుసగా ఫోన్లు రావడం తనకు చిరాకు తెప్పించిందన్నారు. సాధారణంగా తాను కంపోజింగ్ సమయంలో ఫోన్ తీసుకువెళ్లనని, అయితే ప్రొడక్షన్ హౌస్ నుంచి కాల్ వస్తుందని చెప్పడంతో సెల్ తీసుకెళ్లాల్సి వచ్చిందన్నారు. లోపలికి వెళ్ళాక కూడా ఫోన్లు వస్తుండటంతో కోపంతో సెల్ ఫోన్ పగలకొట్టేద్దామనుకున్నానని, అయితే అదే సమయంలో ఫోన్ చేతిలోకి తీసుకోగానే ఒక ఆలోచన వచ్చిందన్నారు. వెంటనే లైట్స్ అన్నీ ఆఫ్ చేసి, కేవలం సెల్ ఫోన్ లైట్ వేసుకుని హుక్ స్టెప్ కంపోజ్ చేశానని, అది చూసి నా భార్య కూడా చప్పట్లు కొట్టడంతో ఆ స్టెప్‌ను ఇంకాస్త డెవలప్ చేసి, ఇప్పుడు మీరు సినిమాలో చూస్తున్న విధంగా ఫైనల్ చేశామన్నారు. చిరంజీవి గ్రేస్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ స్టెప్ డిజైన్ చేశానని సందీప్ వివరించారు.

## ‘రాజా సాబ్ల నుంచి తన స్టంట్ సీక్వెన్స్ వీడియో పంచుకున్న మాళవిక మోహనన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ‘ది రాజా సాబ్ల. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నటించిన మాళవిక మోహనన్, తాజాగా ఈ చిత్రంలోని తన ఫైట్ సీక్వెన్స్‌కు సంబంధించిన ఒక బీటీఎస్ (బిహైండ్ ది సీన్స్) వీడియోను పంచుకున్నారు. తనకు స్టంట్స్ చేయడం అంటే చాలా ఇష్టమని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో ఈ వీడియోను పోస్ట్ చేస్తూ, “సినిమాల్లో అమ్మాయిలకు యాక్షన్ చేసే అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. కానీ నాకు స్టంట్స్ చేయడం చాలా ఇష్టం. ఈ సీన్ చేస్తున్నప్పుడు ఎంతో ఎంజాయ్ చేశాను. మీకు ఈ సీన్ నచ్చిందా?” అని ఆమె ప్రశ్నించారు. మాళవిక పోస్ట్‌పై అభిమానులు, నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. డూప్ లేకుండా సొంతంగా స్టంట్స్ చేయడంపై పలువురు ఆమెను అభినందించారు. ఆమె బాడీ లాంగ్వేజ్, కాన్ఫిడెన్స్ అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఇదిలా ఉండగా, ‘ది రాజా సాబ్ల చిత్రబృందం ప్రేక్షకులకు మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘అప్‌సైడ్ డౌన్ల ఫైట్ సీక్వెన్స్‌ను సినిమాకు జోడించినట్లు ప్రకటించింది. ఈ సినిమా చిత్రీకరణ కోసం మేకర్స్ రెండు భారీ సెట్లు నిర్మించిన విషయం తెలిసిందే. ఒకటి రాయల్ మాన్షన్ కాగా, మరొకటి అదే మాన్షన్‌ను తలకిందులుగా నిర్మించిన సెట్. తలకిందులుగా కనిపించే కొన్ని కీలక సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. మొదట విడుదల చేసిన వెర్షన్‌లో ఈ ఫైట్ సీక్వెన్స్ లేదు. తాజాగా ఈ యాక్షన్ ఘట్టాన్ని జత చేసి, అన్ని థియేటర్లలో ప్రదర్శిస్తున్నట్లు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తమ ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో సినిమాకు మరింత ఆకర్షణ పెరిగింది.



# నా పాత జీవితం వద్దు.. కూతురి బర్త్‌డే రోజున

**కూతురు వామికా ఐదో పుట్టినరోజున అనుష్క శర్మ ఎమోషనల్ పోస్ట్**

**మాతృత్వం తనను ఎలా మార్చిందో వివరిస్తూ ఇన్ స్టాగ్రామ్ స్టోరీ**

**నిన్ను పరిచయం లేని నా పాత వెర్షన్ నాకు వద్దంటూ భావోద్వేగం**

**2021లో విరాట్, అనుష్క దంపతులకు వామికా జననం**

**2018లో వచ్చిన ‘జీరో’ తర్వాత సినిమాల్లో కనిపించని అనుష్క**

తన కుమార్తె వామికా ఐదో పుట్టినరోజు సందర్భంగా బాలీవుడ్ నటి అనుష్క శర్మ మాతృత్వంపై భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తల్లిగా మారిన తర్వాత తనలో వచ్చిన మార్పులను వివరిస్తూ, ఈ ప్రయాణంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నానని తెలిపారు. ప్రపంచంలోని దేనికోసమూ తన మాతృత్వపు అనుభవాన్ని వదులుకోలేనని స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులకు 2021లో వామికా జన్మించిన సంగతి తెలిసిందే. కూతురి పుట్టినరోజున అనుష్క తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మాతృత్వం గురించి ఉన్న ఒక పోస్ట్‌ను రీషేర్ చేశారు. “మాతృత్వం మిమ్మల్ని మార్చనివ్వండి. ఈ కొత్త వెర్షన్‌కు బాధ్యత వహించండి. పాత జీవితాన్ని కొనసాగిస్తూ, పిల్లల్ని కూడా చూసుకోవచ్చనేది పాక్షికంగానే నిజం. దీనికి చెల్లించాల్సిన మూల్యం గురించి ఎవరూ చెప్పరు. అలసిన కళ్లతో, నిండు హృదయంతో మన అవసరాలు అదృశ్యం కావు, అవి పునర్వ్యవస్థీకరించబడతాయి” అని ఆ పోస్ట్‌లో ఉంది. “తల్లి ఒక వైరుధ్యం. ప్రేమ, అలసట, ఎదుగుదల, బాధ అన్నీ పక్కపక్కనే ఉంటాయి. ఈ భావాలన్నీ మనల్ని ఎంతో అలసిపోయేలా చేస్తాయి. మనల్ని తీర్చిదిద్దే ఈ చిన్న, బరువైన, అర్థవంతమైన క్షణాల్లోనే ఇది జరుగుతుంది” అని ఆ పోస్ట్ సారాంశం. ఈ పోస్ట్‌ను షేర్ చేస్తూ అనుష్క తన మనసులోని మాటను బయటపెట్టారు. “నా బిడ్డా.. నువ్వు పరిచయం లేని నా పాత వెర్షన్‌కు నేను ఎప్పటికీ వెనుదిరిగి వెళ్లాలనుకోను. జనవరి 11, 2021” అని రాసి, ఒక హార్ట్ ఎమోజీని జోడించారు. ఈ పోస్ట్ ద్వారా కూతురి పట్ల తనకున్న ప్రేమను, మాతృత్వం తన జీవితంలో తెచ్చిన మార్పును ఆమె ఆర్ద్రంగా వ్యక్తీకరించారు. కాగా, విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ 2017 డిసెంబర్‌లో ఇటలీలో వివాహం చేసుకున్నారు. వీరికి 2021లో కుమార్తె వామికా, 2024 ఫిబ్రవరిలో కుమారుడు అకాయ్ జన్మించారు. ఇక సినిమాల విషయానికొస్తే, అనుష్క చివరిసారిగా 2018లో వచ్చిన ‘జీరో’ చిత్రంలో కనిపించారు. ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో షారుఖ్ ఖాన్, కత్రినా కైఫ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఆ తర్వాత ఆమె నటనకు విరామం ఇచ్చి కుటుంబానికే పూర్తి సమయం కేటాయిస్తున్నారు.